ఏర్పాటు చేయవలయును. కేవలము చారిత్రక దృష్టిలోనేగాక భూగర్భ సంపదదృష్ట్యా యీ ప్రాంత మంతటిని సర్వే చేయించవలసియున్నది. ఈ ప్రాంతములోని పాల్వంచ సంస్థానములో—ఇది శనివారపేట రాజాగారికి వారసత్వరీత్యా లభించినది—పూర్వము ఇంగ్లీషువారి పొలిటికలు ఏజంటు యుండెనని, ఆయన తన డైరీలో పాల్వంచకు సమీపమున బంగారుగని యున్నదని వ్రాసెనని, సుప్రసిద్ధ ఆంధ్ర భూగర్భ పరిశోధకులగు శ్రీ పింగలి వెంకటయ్యగారు చెప్పియుండిరి. ఇంతేగాక సింగరేణి కొత్తగూడెము బొగ్గుగనులు యీ ప్రాంతములోనివే. ఇచట యినుపరాళ్లుకూడ కొల్లలుగ నున్నవి. మొన్న మొన్నటివరకు వీనినుండి స్థానికులు యినుము వండుచుండిరి. కాని కొద్ది సంవత్సరముల క్రితము ప్రభుత్వము దీనిని నిషేధించెను.

హైద్రాబాదు ప్రభుత్వము త్వరలో యీ ప్రాంతమును పరిశోధింపజేసి చరిత్రకును, మన ఖనిజ సంపదకును మహోపకారము జేయగలదని ఆశింతును.

స్కెచ్

# పంకజం తెచ్చిన పంకిలం

"శ్రీవిరించి"

ఎండ మండిపోతోంది; తల మాడిపోతోంది; బుర్ర వేడెక్కింది. పెదవు పొద్దుబారింది; దారి కనిపించదు – అగమ్యగోచరం అనిపిస్తుంది యావత్తూ. తనేంచేశాడు? ఏపాపంచేశాడు తను? ఎందుకోసం యీ శిక్ష? ఏమో-అంతా అనిశ్చిత నిశ్చితం!

ఏమీలేదు; తను జీవితంలో సుఖంగా ఎడ్జెస్టు అవుదామనుకున్నాడు. జీవితంతో కాంప్రొమైజ్ కోసం చూచాడు. కాని యీనాడు, అశలు అడియాసలై తలిచిందీ వలిచిందీ తారుమారై- యీ నడిరోడ్డున. ఎండకు వొళ్ళంతా మండిపోతూండగా-ఎటూ తోచక ఏమీ కానక నించున్నాడు తను. పదాదికిందట, అవును సరిగ్గా పన్నెండు నెలలకిందట-తనస్థానం ఎంత హుందాగావుంది! ఏమిటివాళ తను యెందుకూ పనికిరానివాడైపోవటానికి కారణం? సుఖాన్ని కోరుకోటం తప్పా? అందరూ కోరేదీ, యావజ్జీవమూ ప్రయత్నం చేసేదీ, ఎందుకోసం. ఊరికే-సుఖంకోసం- కదా మరి!

వేదాంతిఅయిపోతున్నాడు తను, అనిపిస్తోంది. ఈ ప్రపంచం అంతా క్షుద్రం, యిందులో ఏదీ నిజం కాదు. ఏదీ అబద్ధంకాదు, ఏదీ మంచి కాదు, ఏదీ చెడ్డకాదు, ఏదీ ఏదీ కాదు. అన్నీ కలగా పులగంగా, అగమ్యగోచరంగా-పిలిస్తే కరవాచేట్లు ఎందుకిట్లా తయారైనాడు తను? ఎవరు యిందుకు దోహదించారు? పంకజం? పంకిలంలోంచి పంకజం బయలుదేరుతుంది కాని— పంకజంతో కూడా పంకిలం వుంటుందని తనకి తోచలేదు; తోస్తే అట్లా చేసివుండేవాడుకాదు. కథ యిట్లా మెలికలుతిరిగేదికాదు. ఏ మంత్రశక్తికో తను బానిసైపోయినాడు. ఏ తపశ్శక్తో తనని పెడిసి కొడుతోంది; అవునా? ఏంతెలుసు తనకి?

ఒక్కడేకొడుకు. అన్నింటికీ అందుబాటు. అందరిలో పలుకుబడి. అన్నీ ఆనందం. అందుకే అయింది తనబతుకిట్లా—అనిపిస్తుంది. యిప్పుడు అనిపిస్తుంది గాని— ఏం.అయింది తన బ్రతుకుకి? హాయిగా, చక్కటిఉద్యోగం. చదివిందితక్కువే అయినా—పూర్వీకుల పుణ్యమాఅంటూ సంతకం పెడుతూ కూర్చునే ఉద్యోగం, రెండొందలు జీతం తన కొక్కడికి! ఏం కావాలి యింతకంటే జీవితంలో? ఎవరుమాత్రం యింతకంటే స్వర్గాలని వేరే కోరుకుంటారు?—అనిపించింది. కానిసుఖం అంటేఏమిటి? ఎందుకోసం అది? అన్నీ ప్రశ్నలు. ఈ జీవితానికి అదీ అంతం పుణ్యం పురుషార్థం

ప్రయోజనం పరితాపం అన్నీ ప్రశ్నలే. ఎవరికీ జవాబులు దొరకని ప్రశ్నలు. జీవితమే ఒక పెద్ద ప్రశ్న—తనలాటివాడికి. కోరికలకి అర్థాలు తెలియనివాళ్ళకీ, కోరికలు ఎందుకోసమో అర్థం చేసుకోలేనివాళ్ళకీ అవి ఎక్కడ ఆగిపోతే ఆనందంగా వుంటుందో తోచనివాళ్ళకి జీవితంఅంతా ఇంతే! ఇట్లా దరీ దాపూలేని మథనమే!

తన జీవితంలో పంకజం ఎవరు? పంకజానికి తానెవరు? ఎన్నోవాడు? యిట్లా మమకారం లేకుండా అనురాగం అవసరంలేకుండా పెరిగే అనుబంధాలు ఎందుకోసం? ఎవరిని ఉద్ధరించను? ఎవరిని అడుగుతాడు తను ఇవన్నీ? అసలు తనా ఊళ్ళో ఎందుకు బసచెయ్యాలి? చేసినా ఆ హోటల్లో ఎందుకు? చేసినాహృదయాన్ని ఎందుకు కంట్రోల్ చేసుకోలేక పోవాలి? సరిగా ఆరాత్రే పంకజం—తన కోసరమే ఉదయించినట్టుగా అప్పుడే అక్కడికి ఎందుకు రావాలి? ఇదంతా ఎప్పుడో పూర్వమే రాసి పడేసుందంటారు. నిజమేనా?

ఎలక్ట్రిక్ లైట్ కాంతిలో పెదవులు వణికి పోతూ పంకజం తనకి కథ చెబుతోంటే: నమ్మకుండావుండటం ఎలానో చేతకాలేదు తనకి. ఎక్కడో పుట్టింది; ఎక్కడో పెరిగింది; ఇక్కడికిట్లా చేరుకుంది. ఎవరూలేరు, ఆనందించేవాళ్ళు, అవసరాలు అడిగేవాళ్లు; తీర్చటానికి ప్రయత్నించేవాళ్ళు, 'ఎవరైనా దగ్గరికి తీస్తానంటే— వెంటనే వొప్పుకుని యావజ్జీవం బానిసలా పడుంటాను. కాస్త విశ్రాంతిగా కాలం వెళ్ళమారుస్తాను—' అంది. ఆ అవకాశం యెవరికో ఎందుకివ్వాలి?

పంకజంలాంటి దివ్యసుందర విగ్రహం... మోకాలెందుకడ్డాలి? తెలివి తక్కువ కాకపోతే అనిపించింది. అంతే! దగ్గరికి తీసుకున్నాడు.

కాలం మధురంగా గడిచిపోయింది. లోకం మనోహరంగా అనిపించింది. కాని ఎంతోకాలం కాగా. రోజులు ఎదురుతిరిగాయి, కాలం బెడిసికొట్టింది: మనుషుల వర్తనాలు మారిపోయినాయి.

పంకజం తనతో ఒకనాడు యేమన్నది? నా యిష్టంవచ్చినట్టు చేస్తాను. నువ్వెందుకు నన్ను ఊరికే బాధపెడతావు? తనకు యిష్టం అంటూ లేదా? పంకజం తన యిష్టాన్ని ప్రతిబింబించదా? ఏమిటీ విభిన్నత?

రానురాను పంకజం తనని అసహ్యించుకుంటుందని తను కల కనలేదు కాగా-కాలం యేం నిరూపించింది? పంకజం నిజమైన పంకజం కాదు! వెనక బోలెడంత కథ వుంది! ఆనాడు తను నమ్మిందీ చేరదీయటానికి దోహదించిందీ శుద్ధ అబద్ధం అని తేలిపోయింది. పంకజానికి తను శతం భీష్మం లాంటివాడు.

మానవత్వంలో నమ్మకం మాసిపోయింది; ఎవరినీ నమ్మరాదు; ఎవరినీ దగ్గరికి తీయరాదు. ఎవరితోనూ హృదయంవిప్పి మాటాడరాదు; ఎట్లా వొంటరిగా వుంటాడు తను? ఎట్లా సాధ్యం అవుతుంది?

పంకజం తన జీవితంలో ప్రవేశించి దారుణమైన మార్పులు తీసుకొచ్చింది కద! తలిదండ్రులకి దూరం అయినాడు. అయినవాళ్ళకు కానివాడైనాడు. హితులకు అహితుడైనాడు. ఇంతా చేసి ఆర్నెల్లు కద! పంకజానికీ తనకీ యేమీ సంబంధంలేదు—అయినవాళ్ళంతా తనని క్షమించరు-తన నిప్పును తమ పక్కన సహించలేరు.

తనకి ఉభయభ్రష్టత్వం వచ్చింది; యిటు తల్లినీ తండ్రినీ చూచుకుంటూ వుండే యోగ్యత పోయింది; అటు పంకజాన్ని చూచుకునే అవసరమూ తీరిపోయింది.

నిక్షేపంలాంటి ఉద్యోగం కాస్తా వూడిపోయింది. తనూ తన విషాదమూ, పాడుగైనబజార్లూ, దుమ్ములేచేరోడ్లూ మిగిలాయి.

ఏమీ దిక్కుతోచక - యిట్లా ఆకాశంవంక చూస్తో కాలం మింగేస్తున్నాడు తను. పగలు సూర్యుడు: ఎండ మండిపోతోంది - రాత్రి చంద్రుడు: చలి ఎముకలు కొరుకుతోంది. తను మాత్రం అన్నింటికీ అతీతుడు. ఇట్లాచూస్తూనే నిరాదరణ సహిస్తూనే - నిర్వికార నిరంజనుడిలా గాలిలో నించున్నాడు. దేదీప్యమానంగా వెలిగిపోతాడు తను. అవును. యిప్పుడు ఎవరూ ఎవరికీ ఏమీకారు. తనుమాత్రం - బాధలు భరిస్తాడు. భయాలు వెనక్కి నెడతాడు; అట్లానే నించుంటాడు; నించున్నంతకాలం చూస్తూంటాడు. ★